క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ఉప్పల్: ఉప్పల్ – వరంగల్ జాతీయ రహదారిపై రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ పోల్స్ మార్పు కారణంగా సోమవారం ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు 33 కేవీ ఫీడరు పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏడీఈ బాలకృష్ణ తెలిపారు. 11 కేవీ బోడుప్పల్, ఆదర్శ్‌నగర్, ఘట్‌కేసర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలైన ఉప్పల్ ప్రధాన రహదారి, ఆదర్శ్‌నగర్, కావేరి నగర్, కుమ్మరి బస్తీ, శ్రీనగర్ కాలనీ, బీరప్పగడ్డ, టీఎక్స్ ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు



కంటి అద్దాలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ మీర్‌పేట్ ప్రతినిధులు

కుషాయిగూడ: సామాజిక భావనతోనే లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ పేదలకు సేవ చేస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ – మీర్‌పేట్ అధ్యక్షుడు బి.మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ తెలిపారు. యశోద ఆసుపత్రి సహకారంతో జవహర్‌నగర్‌లోని సీనియర్ సిటిజన్స్ కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిపుణులైన వైద్యులతో కార్డియో, ఆర్థో, జనరల్ మెడిసిన్‌తో పాటు కంటి పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు అందజేయడంతో పాటు ఉచితంగా మందులు, అవసరమైన వారికి కంటి అద్దాలను అందజేశామన్నారు. రానున్న రోజుల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేసి పేదలకు చేయూతనందిస్తామన్నారు. కార్యక్రమంలో మల్లేష్‌గౌడ్, సీనియర్ సిటిజన్ ప్రతినిధులు పి.రాము, రాంమోహన్, ముత్యంరెడ్డి, ఎల్లారెడ్డి, శ్రీశైలం, అంజుబాయ్, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.


గోశాల అభివృద్ధికి కృషి



గోశాలను పరిశీలిస్తున్న బీఎల్ఆర్

రామంతాపూర్: చిన్న చెరువు ప్రాంగణంలో గల పాండురంగ స్వామి దేవాలయానికి అనుబంధంగా ఉన్న గోశాలను ఆదివారం టీఆర్ఎస్ రాష్ట్ర నేత బండారి లక్ష్మారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని, వివాదాలేవి లేకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో గోశాల ప్రతినిధులు వేముల వెంకట్‌రెడ్డి, దీపక్, సూరం శంకర్, లింగం, ఆనంద్ యాదవ్, పవన్, బొబ్బాల వెంకట్‌రెడ్డి, నరేష్, రాజు యాదవ్, మహ్మద్ జాంగీర్, చాంద్ పాషా, చిన్నారావు, యాకంత్ ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో పండ్ల పంపిణీ



భారతమాత ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేస్తున్న నేతలు

బోడుప్పల్: బీఆర్ఎస్ బోడుప్పల్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, సునీత వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఎంఎస్ఆర్ యువసేన ఆధ్వర్యంలో ఆదివారం అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. తొలుత బాలాజీ హిల్స్ కాలనీలోని మహాకాళేశ్వర, బంగారు మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆశా ఫౌండేషన్‌లో అనాథ పిల్లల సమక్షంలో కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. భారతమాత అనాథ ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీహరిగౌడ్, రాసాల బాలమల్లేష్ యాదవ్, సత్యమూర్తి యాదవ్, నాగేశ్వర్‌రావు, శేఖర్‌రాజు, తాల్క శత్రుఘ్న, పాండు రంగ, మోతే రాజు, ఉప్పరి విజయ్, కుమార్, తిరుపతియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ మున్సిపాలిటీగా పీర్జాదిగూడ కార్పొరేషన్

- కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్ చేతులమీదగా అవార్డు
- అవార్డుతో బాధ్యత పెరిగిందన్న అధికారులు, పాలకవర్గం
- స్వచ్ఛ కార్పొరేషన్ దిశగా పీర్జాదిగూడ
- మరింత అభివృద్ధికి నూతన ప్రణాళికలు



మంత్రి కేటీఆర్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, కమిషనర్

మేడిపల్లి: రాష్ట్రంలో ఉత్తమ మున్సిపల్ కార్పొరేషన్‌గా పీర్జాదిగూడ నగర పాలక సంస్థ నిలిచింది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శిల్పారామంలో జరిగిన తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవ వేడుకల్లో పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేతులమీదగా మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, కమిషనర్ వంశీకృష్ణ, కార్పొరేటర్లు అవార్డు, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ అవార్డు రావడంతో తమకు మరింత బాధ్యత పెరిగిందని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు నూతన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధికారులు, పాలకవర్గం వెల్లడిస్తున్నారు.

స్వచ్ఛ కార్పొరేషన్ దిశగా పీర్జాదిగూడ..

- పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలో 34 వేల ఇళ్లు ఉండగా, రోజుకు 40 టన్నుల చెత్త వస్తోంది. స్వచ్ఛ కార్మికులు(స్వీపర్లు) 130 మంది ఉండగా, 50 స్వచ్ఛ ఆటోల ద్వారా ఇళ్ల నుంచి చెత్తను సేకరిస్తున్నారు. ఇంటి యజమానులు తమ ఇళ్ల వద్దనే తడి, పొడి చెత్తను వేరు చేయగా, స్వచ్ఛ ఆటోల ద్వారా సమీకృత శుద్ధీకరణ కేంద్రానికి తరలిస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఆధునిక యంత్రాలతో చెత్తను మూడు విభాగాలుగా చేశారు. తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్తగా విభజించారు. చెత్త నుంచి తయారు చేసిన సేంద్రీయ ఎరువులను హరితహారంలో నాటిన మొక్కలకు, టెర్రాస్ గార్డెన్‌లకు ఉచితంగా సరఫరా చేస్తున్నారు. పొడి చెత్త నుంచి వచ్చే వస్తువులను వాటిని కొనుగోలు చేసే కంపెనీలకు విక్రయిస్తున్నారు. హానికరమైన చెత్తను (శానిటరీ ప్యాడ్స్) పూర్తిగా కాల్చివేస్తున్నారు. ఇలా ప్రతిరోజూ చెత్తను సేకరిస్తూ నగర పాలక సంస్థను పరిశుభ్రంగా ఉంచడంలో స్వచ్ఛ కార్మికులు, స్వచ్ఛ ఆటోల సిబ్బంది కీలక పాత్రను పోషిస్తున్నారు.

అన్ని విభాగాల్లో ముందుండే విధంగా ప్రణాళికలు..

- పెద్ద చెరువును పర్యాటక ప్రాంతంగా, ఆహ్లాదం పంచే అందమైన మినీ ట్యాంక్ బండ్‌గా రూ.13 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నారు. సుందరీకరణ పనులను చేపట్టి మినీ ట్యాంక్ బండ్‌ను తలపించే విధంగా పనులు జరుగుతున్నాయి. త్వరలో ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నారు.
- నగర పాలక సంస్థ పరిధిలో ఖాళీ స్థలాలను గుర్తించి ప్రతి వెయ్యి మందికి ఒక పార్కు ఉండే విధంగా 100 పార్కులను ప్రతిపాదించారు. అందులో 80 పార్కులను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.
- టీఎస్‌బీపాస్‌లో భాగంగా ఇంటి అనుమతులను అత్యంత పారదర్శకంగా ఆన్‌లైన్‌లో ఇన్‌స్టాంట్ విధానంలో అనుమతులు జారీ చేస్తున్నారు.
- ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను నిర్మించి మానవ వ్యర్థాల నుంచి ఎరువులను తయారు చేస్తున్నారు.
- సర్వ మతస్తులకు ఒకే దగ్గర అధునాతన వైకుంఠదామం నిర్మించి రాష్ట్రంలో ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలుస్తోంది. సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.
- మిషన్ భగీరథ్‌లో భాగంగా ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు రోజు విడిచే సరఫరా అయ్యే విధంగా ప్రణాళికలు చేపట్టారు.
- ప్రకృతి వనాలు, ఓపెన్ జిమ్‌లు, ప్రధాన రోడ్లతోపాటు ప్రతి వీధిలో సీసీ రోడ్లు, ఎల్ఈడీ లైట్లు, రోడ్లకు ఇరువైపులా స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు.
- హరిత హారంలో నాటిన మొక్కల పరిరక్షణ కృషి, క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు, వీధి కుక్కలకు ఏబీసీ సెంటర్, బస్తీ దవాఖాలు, రూ.110 కోట్ల వ్యయంతో బోడుప్పల్, పీర్జాదిగూడ నగర పాలక సంస్థల పరిధిలో స్ట్రాంవాటర్ లైన్ పనులు జరుగుతున్నాయి.

కార్మికుల సేవలు మరవలేనివి..

పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలో స్వచ్ఛ కార్మికులు(స్వీపర్లు) స్వచ్ఛ ఆటోల కార్మికుల సేవలు మరవలేనివి. వారు నిత్యం నగర పాలక సంస్థను పరిశుభ్రంగా ఉండే విధంగా కృషి చేస్తున్నారు. వారి కృషి వల్లే పీర్జాదిగూడకు అవార్డు వచ్చింది. నగర పాలక సంస్థ పరిధిలోని మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు, పాలకవర్గం నూతన ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

– జక్క వెంకట్‌రెడ్డి, మేయర్ పీర్జాదిగూడ నగర పాలక సంస్థ

కనీసం వేతన చట్టం అమలయ్యేలా చూడాలి



మంత్రి మల్లారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దళిత జన కార్మిక విభాగం ప్రతినిధులు

మల్లాపూర్: కార్మికులకు కనీస వేతన చట్టం అమలయ్యేలా చూడాలని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డిని దళిత జన కార్మిక విభాగం అధ్యక్షుడు బొజ్జ రమేష్ కోరారు. ఆదివారం మంత్రి మల్లారెడ్డిని కలిసి కార్మికుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. లేబర్ యాక్ట్ ప్రకారం ప్రతి కార్మికుడికి ఐడీ కార్డు, నెలసరి కనీసం వేతనం రూ.26 వేలు, ప్రతి కార్మికుడికి రూ.10 లక్షల బీమా కల్పించాలని మంత్రిని కోరారు. ఆయనను కలిసిన వారిలో దళిత జనసమితి వ్యవస్థాపకులు బొజ్జ యాదగిరి, నాచారం డివిజన్ ఇన్‌చార్జి బాలయ్య, గంగాధర్ తదితరులు ఉన్నారు.

నేడు ఉప్పల్‌లో హరిత దినోత్సవం

ఉప్పల్: ఉప్పల్ భగాయత్ లే అవుట్‌లో సోమవారం ఉదయం హరిత దినోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 6.30 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతారు.

రాష్ట్రంలో తాగునీటి కష్టాలు లేవు



మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

మల్లాపూర్: రాష్ట్రంలో తాగునీటి కష్టాలు లేవని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్‌లో నీళ్ల పండగను నిర్వహించారు. మల్లాపూర్ రిజర్వాయర్ నుంచి విద్యార్థులతో కలిసి సేవ్ వాటర్.. సేవ్ లైఫ్.. జలం జీవం అంటూ నినాదాలతో నీటిబొట్టు విలువపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం వీఎన్ఆర్ గార్డెన్ సమావేశంలో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి మాట్లాడారు. మిషన్ భగీరథతో ప్రతి ఇంటింటికీ స్వచ్ఛమైన నీటిని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో నెలకు 20వేల లీటర్ల ఉచిత నీటిని సరాఫరా చేస్తున్నామన్నారు. పేదలకు ఒక్క రూపాయికి నీటి కనెక్షన్ ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్ అని కొనియాడారు. ఉప్పల్ నియోజవర్గంలో అవసరమైన చోటా రిజర్వాయర్లను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. మురుగు నీటి సామర్థ్యాన్ని శుద్ధి చేసేందుకు ఎస్టీపీల సంఖ్యను పెంచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాప్రా డీసీ శంకర్, జలమండలి జీఎం సంతోష్‌కుమార్. డీజీఎంలు సంతోష్‌కుమార్, రజినీకాంత్‌రెడ్డి, మేనేజర్లు సత్యనారాయణ, వేణుగోపాల్, రవీందర్, ఆసిఫ్ అలీ, కార్పొరేటర్లు స్వర్ణరాజ్, బొంతు శ్రీదేవీ, ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి, శాంతి సాయిజెన్‌శేఖర్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలి



నాచారం పోలీస్‌స్టేషన్‌లో ఇంకుడు గుంత వద్ద ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతను ఏర్పాటు చేస్తేనే భూగర్భ జలాలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందుతాయని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం నాచారం పోలీస్‌స్టేషన్‌లో జలమండలి అధికారులతో కలిసి ఇంకుడు గుంతలో ఇసుక, కంకర పోసి ఇంకుడు గుంత ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్, జలమండలి మేనేజర్ సంతోష్ కుమార్, డీజీఎం రజనీకాంత్‌రెడ్డి, మేనేజర్ రవీందర్, సత్యనారాయణ, మ్యారి స్వచ్ఛంద సంస్థ సభ్యులు రమాదేవి, బీఆర్ఎస్ నేతలు వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుంటేనే మనుగడ

పర్యావరణ సమతుల్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం నాచారం హెచ్ఎంటీనగర్ చెరువు వద్ద గల(ఎస్టీపీ ప్లాంట్) సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను జలమండలి అధికారులతో కలిసి సందర్శించారు. మురుగు శుద్ధి జలలాపై ఆరా తీశారు. అనంతరం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌తో కలిసి ఎమ్మెల్యే మొక్కలను నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణాన్ని కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఎస్టీపీ డీజీఎం శ్రీధర్‌బాబు, నాగేశ్వర్‌రావు, భాను ప్రసాద్, డీజీఎం రజనీకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు మేకల ముత్యంరెడ్డి, సుగుణాకర్‌రావు, బుచ్చన్నగౌడ్ ఎస్టీపీ ప్లాంట్ సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారు..



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: మిషన్ భగీరథతో తెలంగాణలో ఇంటింటికీ నీటిని అందించిన ముఖ్యమంత్రి కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చర్లపల్లి డివిజన్, పుకట్‌నగర్‌లో మంచినీళ్ల పండగను నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రూపాయికే మంచినీటి అందించిన ఘనత కేసీఆర్‌కే సొంతమన్నారు. బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేసి అమలు చేస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, ధనుంజయ్‌గౌడ్, కొమ్ము సురేష్, గణేష్‌గౌడ్, పుష్పలత, రాములమ్మ, శోభ, అనిత, భాగ్యమ్మ, విజయలక్ష్మీ, ప్రమీల, సుశీల తదితరులు పాల్గొన్నారు.

అరోరాలో ముగిసిన ఫెస్ట్



మేడిపల్లి: పర్వతాపూర్‌లోని అరోరా టెక్నాలజికల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ కాలేజ్, స్టూడెంట్ యాక్టివిటి కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి సాంకేతిక, సాంస్కృతిక, సాహిత్య ఫెస్ట్ బొరియాలిస్‌ని మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి స్టూడెంట్ ట్రైబ్ సీఈఏ శ్రీచరణ్ లక్కరాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాన్ని, జ్ఞాపికను అందజేశారు. ఉస్మానియా ప్రొఫెసర్ డాక్టర్ మృదుల, కళాశాల డైరెక్టర్ శ్రీకాంత్ జట్ల, ఫెస్ట్ కన్వీనర్ శ్రవన్‌కుమార్ రెడ్డి, కో కన్వీనర్ అనీల్ కుమార్, డాక్టర్ అజైకుమార్, బాలకృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు



శేఖర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కార్పొరేటర్లు, జలమండలి అధికారులు

అల్వాల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అల్వాల్‌లోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో జలమండలి విభాగం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వేడుకల్లో కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్‌రెడ్డి, సబితకిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్వాల్ డివిజన్‌లో అకింతభావంతో అద్భుతంగా పనిచేసిన శేఖర్‌కు జ్ఞాపిక అందజేశారు. జలమండలి జీఎం సునీల్, డీజీఎం సాంబయ్య, మేనేజర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా ఫాదర్స్ డే



ట్రై సైకిల్స్‌ను పంపిణీ చేస్తున్న వినయ్

మల్కాజిగిరి: దివ్యాంగుల హక్కుల పోరాట సమితి మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం ఫాదర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణుపురి కాలనీకి చెందిన దస్తగిరి, మహావుదాకు ట్రైసైకిల్‌ను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వినయ్, శాంతాబాయి, శంకర్‌నాయక్, మల్లేష్, హజరత్‌రెడ్డి, రేవతి, నరేష్, నాగలింగం, విజయలక్ష్మి, రమేష్, షబానా తదితరులు పాల్గొన్నారు. దివ్యాంగుల తల్లిదండ్రులను సన్మానించారు.

అలరించిన కూచిపూడి నృత్యం



ఉప్పల్: వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీకళానిలయం కూచిపూడి డాన్స్ అకాడమీ కుమారి సాగరిక, ఐశ్వర్య శిష్య బృందంచే ఉప్పల్ మినీ శిల్పారామంలో నిర్వహించిన పలు పదర్శనలు ఆకట్టుకున్నాయి.

మహిళ ఆత్మహత్య



మృతి చెందిన మహిళ

మల్కాజిగిరి: చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మల్లయ్య వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం మౌలాలి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై నుంచి సుజి(35) మహిళ కిందకు దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మహిళ తన పేరు మాత్రమే చెప్పిందని పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు.

సఫిల్‌గూడ ఎస్టీపీ ప్లాంట్‌ను ఆధునీకరిస్తాం



ఎస్టీపీ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు

మల్కాజిగిరి: సఫిల్‌గూడలోని ఎస్టీపీ ప్లాంట్‌ను ఆధునీకరిస్తామని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు అన్నారు. ప్లాంట్‌ను జలమండలి అధికారులతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం అయన మాట్లాడుతూ గతంలో నిర్మించిన ప్లాంట్ ప్రస్తుత పరిస్థితుల్లో సరిపోవడం లేదని కాలనీవాసుల నుంచి విజ్ఞప్తులు వచ్చాయన్నారు. ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచడానికి గల అవకాశాలను పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. మల్కాజిగిరిలోని సఫిల్‌గూడ, రామక్రిష్ణాపురం, బండచెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, మీనారెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, జీఎం సునీల్‌కుమార్, నాయకులు పరుశురామిరెడ్డి, పిట్ల శ్రీనివాస్, ఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తూ..

ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ న్యూశ్రీనగర్ కాలనీలో రూ.17 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు స్థానిక కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. యూజీడీ, తాగునీటి పైపులైన్ల కనెక్షన్లు పూర్తయిన తర్వాత సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. బాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్ల హామీ ఏమైంది..?



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

అల్వాల్: హామీల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. వెంకటాపురం డివిజన్‌లోని కానాజీగూడ చౌరస్తాలో డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం డబుల్ బెడ్ రూమ్‌ల కోసం చేపట్టిన దీక్షకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఒక్కసారి అవకాశం ఇస్తే తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందన్నారు. యువకులకు ఉద్యోగ భద్రత, డబుల్ బెడ్ రూమ్‌లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు ఇస్తామన్నారు. గ్యాస్ సిలిండర్ రూ.500లకే ఇస్తామన్నారు. ప్రజల సహకారంతో ప్రభుత్వం వ్యతిరేక విధానాన్ని ఎండగడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్‌కుమార్, కృష్ణగౌడ్, నిమ్మ అశోక్‌రెడ్డి, చంద్రశేఖర్, జోలి రమేష్, శివకుమార్, శంకర్, సూర్యప్రకాష్‌రెడ్డి, పవన్, శివశంకర్, ప్రభాకర్, సత్యనారాయణ, వీనస్‌మేరి, పద్మ, ఆశారాణి, సరిత, సుభాషిని, నిర్మల, భవాని తదితరులు పాల్గొన్నారు.

అన్ని కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తాం



కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రాయల్ కాలనీవాసులు

అల్వాల్: వెంకటాపురం డివిజన్‌లోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ సబితకిషోర్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని రాయల్ కాలనీలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో యూజీడీ పునర్నిర్మాణం, సీసీ రోడ్లు వేయాలని కాలనీవాసులు కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేశారు. స్పందించిన కార్పొరేటర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి యూజీడీ, సీసీ రోడ్ల నిర్మాణానికి కృషిచేస్తామని కాలనీవాసులకు కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు నర్సింగ్ రావు, డీఎస్‌రావు, దుగ్గన్న, పి.రాజు, ఈ.రమేష్, సీహెచ్ శ్రీనివాస్, రాజ్‌కుమార్, సీహెచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న సునీత రాముయాదవ్

గౌతంనగర్: పేద విద్యార్థులకు గంగపుత్రులు నోట్ బుక్స్‌ను ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమని స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు. తెలంగాణ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగా భవానీ చారిటబుల్ ట్రస్ట్ మల్కాజిగిరి శాఖ సహకారంతో ఆదివారం జ్యోతినగర్ కమ్యూనిటీ హాల్‌లో గంగపుత్ర సంఘం పేద విద్యార్థులు, అంద విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాముయాదవ్, ట్రస్టు ప్రతినిధులు బక్కి దుర్గయ్య, లక్కంపల్లి లింగయ్య, కిషన్, ముత్యాలు, శ్రీధర్, నర్సింగ్‌రావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.